

కొరవడిన పర్యవేక్షణ

జన్నారం అటవీ డివిజన్‌లో చెక్‌పోస్టుల వద్ద ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను అధికారులు పర్యవేక్షించడంలేదు. దీంతో ఇక్కడి సిబ్బంది ఇష్టారీతిన వ్యవహరిస్తున్నారు. 8లో▸



ఆత్మహత్యాయత్నం.. 8లో▸

బాసర గోదావరి నదిలో పిల్లలతో సహా ఆత్మహత్యకు యత్నించిన వ్యక్తిని పోలీసులు కాపాడారు. అనంతరం అతడికి కౌన్సెలింగ్ ఇచ్చి కుటుంబ సభ్యులకు అప్పగించారు.

వాతావరణం

గరిష్టం/కనిష్టం
33.0 /23.0

ఉష్ణోగ్రతలు స్వల్పంగా తగ్గుతాయి. ఆకాశం మేఘావృతమై వాతావరణం చల్ల బడుతుంది. తుఫాన్ ప్రభావంతో జిల్లాలోని పలు ప్రాంతాల్లో వర్షం కురిసే అవకాశముంది.

వడ్డీ రాయితీ వచ్చింది!

- బ్యాంక్ లింకేజీ రుణాలపై పది నెలల బకాయిలు విడుదల చేసిన ప్రభుత్వం
- జిల్లాకు రూ.21 కోట్లు మంజూరు
- 9,911 మంది సభ్యులకు ప్రయోజనం

నిర్మల్‌చైన్‌గేట్: స్వయం సహాయక సంఘాల మహిళలకు ప్రభుత్వం అండగా నిలుస్తోంది. సంఘాల ఆర్థిక బలోపేతానికి చేయూతనిస్తోంది. సభ్యుల ఆర్థిక స్వావలంబనకు తోడ్పాటునందిస్తోంది. బ్యాంకుల నుంచి వడ్డీలేని రుణాలు తీసుకుని వాయిదాల ప్రకారం సక్రమంగా చెల్లించిన సంఘాలకు వడ్డీ రాయితీ నిధులు మంజూరు చేసింది. 2024–25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఏప్రిల్ 2024 నుంచి జనవరి 2025 వరకు నిధులు విడుదల చేస్తూ ఉత్తర్వులు జారీ చేయగా, అధికారులు అర్హులైన సంఘాల ఖాతాల్లో జమ చేస్తున్నారు. వడ్డీ రాయితీ నిధులు మంజూరు చేయడంపై సంఘాల్లోని సభ్యులు హర్షం వ్యక్తంజేస్తున్నారు.

పది నెలల బకాయిలు విడుదల

2019 నుంచి 2022 వరకు మూడేళ్ల వడ్డీ నిధులు మంజూరు కాలేదు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే 2023–24 సంవత్సరానికి నాలుగు నెలల బకాయిలను కొన్ని నెలల క్రితం విడుదల చేశారు. నాలుగు నెలల బకాయిలు మాత్రమే విడుదల చేయడంతో పొదుపు సంఘాల సభ్యులు నిరాశకు లోనయ్యారు. తాజాగా 2024 ఏప్రిల్ నుంచి 2025 జనవరి వరకు పది నెలల వడ్డీ బకాయిలను ప్రభుత్వం విడుదల చేసింది. జిల్లాలోని 9,911 సభ్యులకు రూ.21కోట్ల 94వేల 124 బకాయిలను విడుదల చేయడంతో స్వయం సహాయక సంఘాల సభ్యులకు ఊరట లభించినట్లయింది.

స్వయం ఉపాధికి ఊతం

స్వయం సహాయక సంఘాల్లోని సభ్యులు బ్యాంక్ లింకేజీ కింద తీసుకున్న వడ్డీ లేని రుణాల (వీఎల్ఆర్)తో ఆర్థికంగా ఎదగటంతో పాటు మరికొందరికి ఉపాధి కల్పిస్తున్నారు. ప్రభుత్వం మహిళలను పారిశ్రామిక వేత్తలుగా ఎదిగేలా ప్రోత్సహిస్తోంది. ఇందులో భాగంగా పలువురు చిన్న తరహా పరిశ్రమలు, యూనిట్లు నెలకొల్పుతున్నారు. క్యాంటీన్ల ఏర్పాటు, పెరటి కోళ్ల పెంపకం, గేదెల పోషణ, కిరాణం, క్లాత్ స్టోర్లు, టైలరింగ్, శానిటరీ న్యాప్‌కిన్‌ల తయారీ తదితర రంగాలను ఎంచుకుని ఆదాయం పొందుతూ ఆర్థికంగా రాణిస్తున్నారు.



మండలాల వారీగా ఇలా..

మండలం	చెల్లించిన సొమ్ము (రూపాయల్లో)	చెల్లించాల్సిన సొమ్ము (రూపాయల్లో)	మంజూరైన సొమ్ము (రూపాయల్లో)
బాసర	72,53,715	28,740	73,32,132
భైంసా	1,51,34,054	1,87,061	1,53,21,115
దస్తురాబాద్	52,81,692	1,31,496	54,13,188
దిలావర్‌పూర్	1,19,69,347	11,947	1,19,81,294
కడెం	1,22,46,739	1,13,438	1,23,60,177
ఖానాపూర్	91,87,154	97,682	92,84,836
కుభీర్	1,21,80,194	5,04,171	1,26,84,365
కుంటాల	1,03,81,669	2,88,123	1,06,69,792
లక్ష్మణచాంద	1,32,75,698	2,18,991	1,34,94,689
లోకేశ్వరం	1,82,35,204	54,136	1,82,89,340
మామడ	90,29,955	1,08,698	91,38,653
ముధోల్	1,75,87,596	1,04,490	1,76,92,086
నర్సాపూర్ (జి)	1,14,41,397	25,978	1,14,67,375
నిర్మల్ రూరల్	1,32,83,321	1,446	1,32,84,767
పెంబి	21,54,056	28,855	21,90,096
సారంగాపూర్	2,04,77,889	4,59,958	2,09,37,847
సోన్	89,81,325	94,696	90,76,021
తానూరు	93,73,289	1,03,062	94,76,351

పాత బకాయిల ఎప్పుడిస్తరో!

గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో చెల్లించాల్సిన వడ్డీ బకాయిలు అలాగే పేరుకుపోయాయి. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ తన హయాం నుంచి వడ్డీ బకాయిలు విడతల వారీగా చెల్లిస్తూ వస్తోంది. బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో పేరుకుపోయిన భారీ మొత్తంలోని బకాయిల గురించి ఎవరూ ఊసెత్తడం లేదు. అధికారులు, ప్రభుత్వం దీనిపై ఎలాంటి ప్రకటన చేయకపోవడంతో స్వయం సహాయక సంఘాల సభ్యుల్లో అయోమయం నెలకొంది.

న్యూస్‌రీల్

ఎస్పీ ప్రజావాణికి స్పందన



ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న ఎస్పీ

భైంసాటౌన్: పట్టణంలోని తన క్యాంపు కార్యాలయంలో ఎస్పీ జానకీ షర్మిల్ బుధవారం నిర్వహించిన ప్రజావాణికి స్పందన లభించింది. భైంసా సబ్ డివిజన్ వ్యాప్తంగా వచ్చిన బాధితులు నేరుగా ఎస్పీని కలిసి అర్జీలు అందజేశారు. సమస్యలు తెలిపి పరిష్కరించాలని కోరారు. ఈ సందర్భంగా ఎస్పీ స్పందించి సమస్యల పరిష్కారానికి సంబంధిత స్టేషన్ అధికారులకు ఫోన్‌లో సూచనలు చేశారు. అనంతరం భరోసా కేంద్రంలో పలు కేసుల్లో కుటుంబ సభ్యులకు సిబ్బందితో కౌన్సెలింగ్ ఇప్పించారు. వివిధ కారణాలతో విడిపోయిన దంపతులకు కౌన్సెలింగ్ కోసం ఏర్పాటు చేసిన భరోసా కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఏఎస్పీ అవినాష్ కుమార్, సీఐలు గోపీనాథ్, మల్లేశ్, ఎస్సైలు శ్రీనివాస్‌యాదవ్, శంకర్, ప్రొబేషనరీ మహిళా ఎస్సై సుప్రియ, భరోసా సెంటర్ సిబ్బంది జ్యోతి, శిరీష, క్యాంప్ ఇన్‌చార్జి రఘువీర్ పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో పాపన్న వర్ధంతి



చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న అధికారులు

నిర్మల్‌చైన్‌గేట్: కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో బుధవారం సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ వర్ధంతిని నిర్వహించారు. అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిశోర్‌కుమార్ హాజరై పాపన్నగౌడ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. దొరలు, భూస్వాములు, పెత్తందార్లకు వ్యతిరేకంగా పాపన్నగౌడ్ పోరాడిన తీరును వివరించారు. పాపన్న గౌడ్ ఆశయ సాధనకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా బీసీ సంక్షేమ అధికారి శ్రీనివాస్, సీపీవో జీవరత్నం, గిరిజన సంక్షేమ అధికారి అంబాజీ, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ శంకర్, లీడ్ బ్యాంక్ మేనేజర్ రామ్‌గోపాల్, కుల సంఘాల నాయకులు అమరవేణి నర్సాగౌడ్, అనుముల భాస్కర్, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సాగునీరు అందించాలి



కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న రైతులు

కడెం: కడెం, సదర్‌మాట్ చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందించాలని బుధవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ అభిలాష అభినవ్‌కు రైతులు వినతిపత్రం అందజేశారు. మండలంలోని మొర్రిగూడం, చిన్నబెల్లాల, పెద్దబెల్లాల, పెద్దూర్ తండా, చిట్యాల, కొత్త మద్దిపడగ, లక్ష్మీసాగర్ గ్రామాల్లోని పంటలకు మరో రెండు తడులకు సాగునీరు అందించాలని కోరారు. వరి పంట పొట్ట దశలో ఉండగా సాగునీరు అందక పొలాలు ఎండిపోతున్నాయని తెలిపారు. చెరువులు, కుంటలు నింపి సాగునీరు ఇవ్వాలని కోరారు. కలెక్టర్‌ను కలిసినవారిలో రైతులు వెంకటేశ్, మల్లేశ్, రాజేశ్వర్, శ్రీనివాస్, సత్తన్న, గంగన్న, హనుమాండ్లు, చిన్న రాజం, నర్సయ్య, లింగన్న, లచ్చన్న, రవి, తిరుపతి, శ్రీనివాస్‌గౌడ్, రాజేశ్, ఉపేందర్ తదితరులున్నారు.

సాగునీటి కోసం 'కడెం' ఆయకట్టు రైతుల ఆందోళన

కడెం: మండల కేంద్రంలోని ఇరిగేషన్ కార్యాలయం వద్ద కడెం ప్రాజెక్ట్ ఆయకట్టు పరిధిలోని దేవునిగూడెం, అంబర్‌పేట్ గ్రామాల రైతులు బుధవారం ఆందోళనకు దిగారు. ఉన్నతాధికారులు అందుబాటులో లేకపోవడంతో రైతులు వారితో ఫోన్‌లో మాట్లాడారు. గురువారం కార్యాలయానికి వస్తామని, నీటి విడుదలపై మాట్లాడామని అధికారులు చెప్పగా రైతులు అసహనంతో వెళ్లిపోయారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ.. కడెం ఆయకట్టు రైతుల పంటలకు సాగునీరు ఇవ్వడంలో అధికారులు విఫలమయ్యారని ఆరోపించారు. పంటలకు సాగునీరు అందక ఎండిపోతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే సాగునీరు విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

ముగిసిన 'పది' పరీక్షలు

నిర్మల్ రూరల్: పదో తరగతి వార్షిక పరీక్షలు జిల్లాలో ప్రశాంతంగా ముగిసాయి. బుధవారం నిర్వహించిన చివరి పరీక్షకు 9,129 మంది విద్యార్థులకు 9,117మంది హాజరయ్యారు. 12 మంది గైర్హాజరైనట్లు అధికారులు తెలిపారు.



పరీక్ష రాసి బయటకు వస్తున్న విద్యార్థినులు

'పది'లంగా ఇంటిబాట..

పదో తరగతి పరీక్షలు బుధవారం ముగిశాయి. జిల్లా కేంద్రంలోని ఆయా కేంద్రాల్లో పరీక్షలు రాసిన విద్యార్థులు ఆనందంతో బయటకు వచ్చారు. స్నేహితులతో సెల్ఫీలు దిగి బాయ్.. చెప్పుకొన్నారు. హాస్టళ్లలో ఉంటున్న విద్యార్థులు తల్లిదండ్రులతో ఇంటిబాట పట్టారు. దీంతో బస్టాండ్ రద్దీగా మారింది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, నిర్మల్



తల్లిదండ్రులతో బస్సు ఎక్కుతున్న విద్యార్థులు

కొనుగోళ్లు పకడ్బందీగా చేపట్టాలి

- కలెక్టర్ అభిలాష అభినవ్
- అధికారులతో సమావేశం

నిర్మల్‌చైన్‌గేట్: యాసంగి వరి ధాన్యం కొనుగోళ్లను పకడ్బందీగా చేపట్టాలని కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో సంబంధిత అధికారులతో ఆమె యాసంగి వరి కొనుగోళ్ల ప్రక్రియపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. త్వరగా కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు చర్యలు చేపట్టాలని సూచించారు. కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు, సిబ్బందికి శిక్షణ ఇవ్వాలని, కేంద్రాల్లో సరిపడా తూకపు, తేమ, ప్యాడీ క్లీనింగ్ యంత్రాలు, గన్నీ సంచులు, టార్పాలిన్లు అందుబాటులో ఉంచాలని తెలిపారు. సరిపడా హమాలీలు, లారీలను సమకూర్చుకోవాలని పేర్కొన్నారు. కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా అన్ని వసతులు కల్పించాలని సూచించారు. ధాన్యం తూకం జరిగిన 24 గంటల్లోపు ఆన్‌లైన్ నమోదు ప్రక్రియ పూర్తి చేయాలని సూచించారు. రోజువారీగా ధాన్యం కొనుగోళ్ల నివేదికలు అందజేయాలని తెలిపారు. మిల్లర్లు తప్పనిసరిగా ప్రభుత్వ నిబంధనలు పాటించాలని సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిశోర్‌కుమార్, ఆర్డీవో రత్నకల్యాణి, జిల్లా వ్యవసాయాధికారి అంజిప్రసాద్, పౌరసరఫరాల జిల్లా మేనేజర్ సుధాకర్, ఇన్‌చార్జి డీఆర్డీవో శ్రీనివాస్, ఇన్‌చార్జి ఏడీ మార్కెటింగ్ గజానంద్, జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ రామ్‌గోపాల్, డీసీవో కార్యాలయ అధికారి రాజమల్లు, జిల్లాలోని రైస్‌మిల్లర్లు, లారీ ట్రాన్స్‌పోర్ట్ ప్రతినిధులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ అభిలాష అభినవ్

9న రాంజీగోండ్ వర్ధంతి

నిర్మల్‌చైన్‌గేట్: తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో రాంజీగోండ్ వర్ధంతి సభను ఈ నెల 9న జిల్లా కేంద్రంలోని కూరన్నపేట్‌లో ఘనంగా నిర్వహించనున్నట్లు రాంజీగోండ్ వర్ధంతి నిర్వహణ కమిటీ అధ్యక్షుడు తొడసం శంభు తెలిపారు. బుధవారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లా కేంద్రంలోని స్తూపం నుంచి గిరిజన సంప్రదాయ డోలు, నృత్య ప్రదర్శనలు నిర్వహించనున్నట్లు తెలిపారు. సభకు ముఖ్య అతిథిగా తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర నాయకుడు బండారు రవికుమార్ హాజరవుతారని పేర్కొన్నారు. జిల్లా అధికారులు, ప్రజాసంఘాల నాయకులు, ప్రతినిధులు కూడా పాల్గొననున్నట్లు తెలిపారు. ఈ సభలో గిరిజనుల చారిత్రక పోరాట గాథలు, మార్సకోలా రాంజీగోండ్ నాయకత్వం, ఆదివాసీ సమాజానికి ఆయన అందించిన స్ఫూర్తిదాయక ఉపదేశాలపై చర్చించనున్నట్లు పేర్కొన్నారు. సమావేశంలో తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కమిటీ సభ్యులు, రాంజీగోండ్ వర్ధంతి నిర్వహణ కమిటీ సభ్యులు తొడసం శంభు, సోయం సూర్యభాన్, ఉయ్యాక భీంరావ్, ఆత్రం అర్జున్, వేలాది గణేశ్, కుడిమేత విజయ, నాగోరావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న తొడసం శంభు

సాగులో సాంకేతికత

- పెరిగిన యంత్రాల వినియోగం
- డ్రోన్‌తో రసాయనాల పిచికారీ
- పంటల చుట్టూ సోలార్ కంచె

నిర్మల్‌ఖిల్లా: జిల్లాలో పంటల రక్షణకు రైతులు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం వినియోగించుకుంటున్నారు. కూలీల కొరతను అధిగమిస్తూనే సమయాన్ని ఆదా చేసుకునే ప్రయత్నం చేస్తున్నారు. సేద్యం చేస్తున్న రైతాంగం పంటల సస్యరక్షణ కోసం కూలీలను పెట్టి రసాయనాలు పిచికారీ చేయడం ద్వారా ఖర్చు అధికమవుతుండడంతో అధునాతన పద్ధతులు అవలంబిస్తున్నారు.

డ్రోన్‌తో పిచికారీ

నిర్మల్ రూరల్ మండలంలోని వెంగ్వాపేట్ పరిసర ప్రాంతాల్లో ఎక్కడ చూసినా రైతులు పంటల సంరక్షణకు డ్రోన్లతో క్రిమిసంహారకాలు పిచికారీ చేయిస్తున్నారు. కూలీలను పెట్టి పిచికారీ చేయిస్తే అధిక ఖర్చు అవుతుండగా డ్రోన్‌ను వినియోగిస్తున్నారు.



జిల్లా వ్యాప్తంగా కూడా అనేక ప్రాంతాల్లో డ్రోన్‌లతో పంటలపై రసాయనాలు పిచికారీ చేయిస్తున్నారు. దీంతో డబ్బుతోపాటు సమయం కూడా ఆదా అవుతున్నట్లు రైతులు చెబుతున్నారు.

సోలార్ కంచెలు.. చార్జింగ్ మైకులు

ఆరుగాలం జిల్లా రైతాంగం పంటలపై ప్రత్యేక శ్రద్ధ కనబరిచినా చేతికొచ్చే దశలో అటవీ జంతువులు, కోతుల బారిన పడి విధ్వంసం జరుగుతున్న ఘటనలు అనేకం. దీంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఈ నేపథ్యంలో రైతులు సౌర కంచెతో పంట పొలాలను రక్షించుకునే ప్రయత్నం చేస్తున్నారు. సోలార్ ద్వారా ప్యానెల్‌ను ఏర్పాటు చేసి పొలాల చుట్టూ తీగలను ఏర్పాటు చేస్తుండడంతో కోతులు, అడవి జంతువులు దరి చేరడం లేదని చెబుతున్నారు. మరోవైపు పక్షులు, వానరాలు మొక్కజొన్న, జొన్న, సజ్జ తదితర పంటలను నాశనం చేస్తుండగా, రోజంతా రికార్డెడ్ వాయిస్ ద్వారా శబ్దాలు చేసే చార్జింగ్ మైక్‌సెట్‌లను అమర్చి పంటలను కాపాడుకుంటున్నట్లు పేర్కొన్నారు.

'హామీలు మరిచిన ప్రభుత్వం'



కలెక్టరేట్ ఎదుట బైఠాయించిన వీవోఏలు

నిర్మల్‌చైన్‌గేట్: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో తమకు ఇచ్చిన హామీలు అధికారంలోకి వచ్చాక విస్మరించిందని వీవోఏల సంఘం జిల్లా అధ్యక్షుడు ప్రభాకర్ ఆరోపించారు. వీవోఏల సమస్యలు పరిష్కరించాలని బుధవారం కలెక్టర్ కార్యాలయాన్ని వీవోఏలు ముట్టడించారు. దీనిని ముందే గ్రహించిన పోలీసులు కలెక్టరేట్ ఎదుట భారీ బందోబస్తు చేపట్టి వీవోఏలను లోనికి అనుమతించకుండా అడ్డుకున్నారు. దీంతో వీవోఏలు గేటు బయట బైఠాయించారు. అనంతరం ఇన్‌చార్జి డీఆర్డీవో శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మూడేళ్లుగా రావాల్సిన స్త్రీనిధి ఇన్సెంటివ్ డబ్బులు వీవోఏలు, వీవోలకు ఇప్పించాలని కోరారు. స్త్రీనిధి బ్యాంక్ నుంచి వీవోఏలకు నేరుగా రూ.10వేల వేతనంతో పాటు ట్యాబ్, ఇంటర్నెట్ సౌకర్యం కల్పించాలని, సీనియారిటీ ప్రాతిపదికన వీవోఏలకు ప్రమోషన్లు ఇవ్వాలని సూచించారు. పెండింగ్ క్లెయిమ్‌లను వెంటనే క్లియర్ చేయాలని ఆదేశించారు. వీవోఏలు స్వప్న, సంగీత, శరత్, పవన్, చంద్రకాంత్ తదితరులు పాల్గొన్నారు.

సర్వీస్ బుక్‌లో వివరాలు నమోదు చేయాలి

నిర్మల్ రూరల్: జిల్లాలో ఇటీవల జరిగిన బదిలీలు, ప్రమోషన్లలో ప్రత్యేక కేటగిరి వాడుకున్న ఉపాధ్యాయుల సర్వీస్ వివరాలను వారి సర్వీస్ బుక్‌లలో నమోదు చేయాలని ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం నాయకులు బుధవారం డీఈవో రామారావుకు వినతిపత్రం ఇచ్చారు. ఉపాధ్యాయుల సర్వీస్‌కు సంబంధించిన ప్రత్యేక కేటగిరి, భార్యాభర్తల కేటగిరి, ప్రమోషన్ వద్దని నాట్ విల్లింగ్ ఇచ్చిన వారి పూర్తి వివరాలు సర్వీస్ రిజిస్టర్‌లో నమోదు చేయకపోవడంతో అర్హత కలిగిన ఇతర ఉపాధ్యాయులకు వచ్చే బదిలీలు, ప్రమోషన్లలో అన్యాయం జరుగుతుందన్నారు. విచారణ చేపట్టి ఉపాధ్యాయుల పుస్తకంలో నమోదు చేయిస్తామని డీఈవో హామీ ఇచ్చారు. జిల్లా అధ్యక్షుడు రాజేశ్‌నాయక్ తదితరులున్నారు.



డీఈవోకు వినతిపత్రం ఇస్తున్న రాజేశ్‌నాయక్

పరీక్షా కేంద్రాల సందర్శన



విద్యార్థులతో భోజనం చేస్తున్న రామారావ్

తానూరు: మండలంలోని ఎల్వి, భోసి, తానూరులోని పదో తరగతి పరీక్షా కేంద్రాలను బుధవారం డీఈవో పీ రామారావ్ సందర్శించారు. తానూరులో పదో తరగతి విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. ఎంఈవో నరేందర్, సీఎస్‌లు శంకర్, రాజశేఖర్, మల్లన్న, సిబ్బంది లింబాద్రి తదితరులున్నారు.

రేషన్ దుకాణం తనిఖీ



రేషన్‌షాపు తనిఖీ చేస్తున్న కిశోర్‌కుమార్

సోన్: మండలంలోని న్యూ బొప్పారం గ్రామంలోని రేషన్‌షాపును బుధవారం అడిషనల్ కలెక్టర్ కిశోర్‌కుమార్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. సన్న బియ్యం పంపిణీని పరిశీలించారు. మంగళవారం ఇదే షాపులో తహసీల్దార్ మల్లేశ్‌రెడ్డి సన్నబియ్యం పంపిణీని ప్రారంభించడం గమనార్హం. ఆయన వెంట ఆర్ఐ అలీమున్నీసా, డీలర్ హన్మంతు తదితరులున్నారు.

'యువ వికాసం' దరఖాస్తు గడువు పెంపు



ఫ్లెక్సీ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ అభిలాష అభినవ్, అధికారులు

నిర్మల్‌చైన్‌గేట్: రాజీవ్ యువ వికాసం పథకం దరఖాస్తు గడువు ఈనెల 14 వరకు పెంచినట్లు కలెక్టర్ అభిలాష అభినవ్ తెలిపారు. అర్హులైన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాలకు చెందిన నిరుద్యోగులు దరఖాస్తు చేసుకునేలా చూడాలని అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో రాజీవ్ యువ వికాసం పథకంపై సంబంధిత అధికారులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. శాఖలవారీగా ఇప్పటివరకు వచ్చిన దరఖాస్తులకు సంబంధించిన వివరాలు తెలుసుకున్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ విధానాల్లో దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఆఫ్‌లైన్ విధానంలో దరఖాస్తు చేసుకునేందుకు సంబంధిత దరఖాస్తు పత్రాలను మండల పరిషత్, మున్సిపల్ కార్యాలయాల్లో అందుబాటులో ఉంచినట్లు పేర్కొన్నారు. పథకంపై సందేహాలను నివృత్తి చేసేందుకు హెల్ప్‌డెస్క్‌లు ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. దరఖాస్తుదారులు ఎంచుకున్న స్వయం ఉపాధి యూనిట్ల ఆధారంగా శిక్షణ ఉంటుందని తెలిపారు. అనంతరం రాజీవ్ యువ వికాసం హెల్ప్‌డెస్క్ పోస్టర్ ఆవిష్కరించారు. సమావేశంలో ఇన్‌చార్జి డీఆర్డీవో శ్రీనివాస్, జిల్లా బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, సంక్షేమ శాఖల అధికారులు శ్రీనివాస్, శంకర్, అంబాజీ, మోహన్‌సింగ్, ఏసీడీపీవో నాగలక్ష్మి, ఈడీఎం నదీమ్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి శిక్షణ తరగతులు

నిర్మల్ రూరల్: గత జూన్‌లో ప్రమోషన్ పొందిన ఉపాధ్యాయులకు గురువారం నుంచి శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు డీఈవో రామారావు ఓ ప్రకటనలో తెలిపారు. పీజీహెచ్‌ఎం, ఎల్‌ఎఫ్‌ఎల్ హెచ్‌ఎంలకు ఈనెల 3, 4 తేదీల్లో జిల్లా కేంద్రంలోని పంచశీల బీఎడ్ కాలేజీలో, తెలుగు స్కూల్ అసిస్టెంట్లకు విజయ హైస్కూల్‌లో, హిందీ స్కూల్ అసిస్టెంట్లకు జుమ్మేరాత్‌పేట్ హైస్కూల్‌లో శిక్షణ ఉంటుందని పేర్కొన్నారు. బయోలాజికల్ సైన్స్, సోషల్ స్టడీస్ స్కూల్ అసిస్టెంట్లు, హైస్కూల్ ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్లకు ఈ నెల 3, 4 తేదీల్లో ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని డైట్ కళాశాలలో, ఫిజికల్ సైన్స్ స్కూల్ అసిస్టెంట్లకు ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని గవర్నమెంట్ హైస్కూల్–1లో, ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని గవర్నమెంట్ గర్ల్స్ హైస్కూల్‌లో ఇంగ్లిష్, గణితం స్కూల్ అసిస్టెంట్లకు, హైదరాబాద్‌లోని రాజేంద్రనగర్‌లో ఉర్దూ స్కూల్ అసిస్టెంట్లకు శిక్షణ తరగతులు ఉంటాయని వివరించారు. ప్రమోషన్ పొందిన ఉపాధ్యాయులు తప్పకుండా హాజరుకావాలని సూచించారు.

క్లుప్తంగా

రైతుపై అడవిపంది దాడి


గాయాలతో కిషన్

జన్నారం: అడవి పంది దాడిలో మండలంలోని పొనకల్ గ్రామానికి చెందిన రైతు తీవ్రంగా గాయపడ్డాడు. బాధితుడు చిరివేణి కిషన్ తెలిపిన వివరాల ప్రకారం బుధవారం ఉదయం పొనకల్ గ్రామ శివారులోని పంట పొలాలకు కిషన్ నీరు పెట్టేందుకు వెళ్లగా అడవిపంది ఒక్కసారిగా దాడి చేసింది. భయంతో కిషన్ కేకలు వేయగా సమీపంలో ఉన్న మరో వ్యక్తి రావడంతో అడవి పంది పారిపోయింది. దాడిలో కిషన్ కుడి భుజం, కుడి కన్ను కింద గాయాలయ్యాయి. వెంటనే కుటుంబ సభ్యులు జన్నారం ఆసుపత్రిలో చికిత్స చేయించి మెరుగైన వైద్యం కోసం మంచిర్యాలకు తరలించారు.

పాత గోదాంలో అగ్నిప్రమాదం

భైంసాటౌన్: పట్టణంలోని ఈసేవా కాంప్లెక్స్ సమీపంలో గల పాత గోదాంలో బుధవారం మంటలు చెలరేగాయి. గోదాం కొన్నేళ్లుగా నిరుపయోగంగా ఉండగా చెత్తాచెదారం పేరుకుపోయింది. ప్రమాదవశాత్తు చెత్తకు నిప్పంటుకోగా దట్టమైన పొగలు రావడంతో స్థానికులు అగ్నిమాపక శాఖకు సమాచారమిచ్చారు. అగ్నిమాపక సిబ్బంది అక్కడికి చేరుకుని మంటలు ఆర్పివేశారు. ప్రమాదంలో ఎలాంటి నష్టం వాటిల్లలేదు.

పాఠశాలలో చోరీకి యత్నం


తరగతి గదిని పరిశీలిస్తున్న ఎస్సై

కడెం: మండలంలోని పెద్దూర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి యత్నించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు భూమేశ్వర్ తెలిపిన వివరాల ప్రకారం.. పాఠశాలకు గత మూడు రోజులుగా సెలవులు ఉన్నాయి. సెలవు రోజుల్లో గుర్తు తెలియని వ్యక్తులు పాఠశాలలోని రెండు తరగతి గదుల తాళాలు పగలగొట్టి చోరీకి యత్నించారు. పాఠశాలలో విలువైన సామగ్రి లేకపోవడంతో దొంగలు ఎక్కడివి అక్కడే వదిలేసి వెళ్లిపోయారు. కాగా హెచ్ఎం ఫిర్యాదుతో ఎస్సై కృష్ణసాగర్‌రెడ్డి బుధవారం పాఠశాలను పరిశీలించారు.

కీచక ఉపాధ్యాయులపై కేసు నమోదు

నర్సాపూర్ (జి): మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో గత ఫిబ్రవరిలో విద్యార్థినులతో అసభ్యంగా ప్రవర్తించిన గణిత ఉపాధ్యాయుడు ఆలూరి మనోహర్ రెడ్డి, ఆంగ్ల ఉపాధ్యాయుడు సాయిని మోహన్‌రావులపై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో పోక్సో కేసుతో పాటు బుధవారం అదనంగా ఎస్సీ, ఎస్టీ పీఓఏ యాక్ట్ 1989ను నమోదు చేశారు. విచారణ అధికారిగా ఉన్న నిర్మల్ ఏఎస్పీ రాజేశ్‌మీనా మాట్లాడుతూ ఫిబ్రవరి నుంచి ఇద్దరు ఉపాధ్యాయులు పరారీలో ఉండగా నిర్మల్ జిల్లా కేంద్రంలో మార్చి 8న మనోహర్‌రెడ్డిని, ఏప్రిల్ 1న మోహన్‌రావును అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు.

పేకాటస్థావరంపై దాడి

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం దొనబండ శివారులో పేకాట స్థావరంపై బుధవారం ఎస్సై గోపతి సురేశ్ ఆధ్వర్యంలో దాడులు నిర్వహించారు. పేకాట ఆడుతున్న వారిలో ముగ్గురు పారిపోగా ఇద్దరిని అరెస్ట్ చేశారు. రూ.3,720 నగదు, రెండు మొబైల్ ఫోన్‌లు, ఆటో స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

కొరవడిన పర్యవేక్షణ!

- అటవీ చెక్‌పోస్టుల వద్ద సీసీకెమెరాలు ఏర్పాటు
- తూతూ మంత్రంగా ఉన్నతాధికారుల పరిశీలన
- విధుల్లో ఇష్టారీతిగా వ్యవహరిస్తున్న సిబ్బంది



ఇందన్‌పల్లి చెక్‌పోస్టు వద్ద ఏర్పాటు చేసిన సీసీకెమెరా

జన్నారం: జన్నారం అటవీ డివిజన్‌లో స్మగ్లింగ్ నిరోధించేందుకు, అధికారుల పనితీరు పర్యవేక్షించేందుకు చెక్‌పోస్టుల వద్ద ఏర్పాటు చేసిన సీసీకెమెరాలు తూతూ మంత్రంగా మారాయి. సీసీకెమెరాల నిర్వహణ చేపడుతున్నా ఉన్నతాధికారులు సీసీఫుటేజీలను పర్యవేక్షించకపోవడంతో క్షేత్రస్థాయి సిబ్బంది ఇష్టారీతిగా వ్యవహరిస్తున్నారు. చెక్‌పోస్టు వద్ద డ్యూటీలో ఉన్న సిబ్బంది సంతకం చేసిన తర్వాత అక్కడే 24 గంటలు పని చేయాల్సి ఉంటుంది. కానీ సంతకం చేసిన తర్వాత తమ సొంత పనుల కోసం వెళ్తున్నట్లు సమాచారం ఉంది. చెక్‌పోస్టుల వద్ద బీట్, సెక్షన్ అధికారులతో పాటు వాచర్లు కూడా విధులు నిర్వహిస్తుంటారు. అయితే వాచర్లకు బాధ్యతలు అప్పగించి అక్కడ డ్యూటీ చేసే ఇతర సిబ్బంది సొంత పనుల కోసం వెళ్తున్నట్లు తెలుస్తోంది. ఇలా పలు చెక్‌పోస్టుల్లో జరుగుతుండగా ఇటీవల ఉన్నతాధికారి గమనించి హెచ్చరించినట్లుగా సమాచారం. గతంలో పని చేసిన ఎఫ్‌డీవో మాధవరావు సీసీకెమెరాల్లోనే సిబ్బంది పనితీరు ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ హెచ్చరికలు జారీ చేయడంతో ఎలాంటి నిర్లక్ష్యం జరగలేదు. కానీ ప్రస్తుతం ఉన్నతాధికారులు సీసీకెమెరాలను పట్టించుకోకపోవడంతో సిబ్బందిపై పర్యవేక్షణ లేక ఇష్టారీతిగా వ్యవహరిస్తున్నారు.

మూడేళ్ల క్రితం ఏర్పాటు..

జన్నారం అటవీ డివిజన్‌లో స్మగ్లింగ్ నిరోధించేందుకు, అధికారుల పనితీరు పర్యవేక్షించేందుకు మూడేళ్ల క్రితం చెక్‌పోస్టుల వద్ద సీసీకెమెరాలు ఏర్పాటు చేశారు. సీసీకెమెరాల ఏర్పాటుతో చెక్‌పోస్టుల వద్ద జరుగుతున్న వాహనాల తనిఖీలు, రాత్రి పూట వాహనాల ప్రవేశంతో పాటు చెక్‌పోస్టుల వద్ద పని చేస్తున్న సిబ్బంది పనితీరు పర్యవేక్షించేవారు. డివిజన్‌లోని ఇందన్‌పల్లి, కలమడుగు, తపాలపూర్ చెక్‌పోస్టుల వద్ద సీసీకెమెరాలు ఏర్పాటు చేశారు.

ఎన్నో ప్రయోజనాలు..

ప్రధాన రహదారిపై గల అటవీశాఖ చెక్‌పోస్టుల వద్ద ఏర్పాటు చేసిన సీసీకెమెరాలతో బహుళ ప్రయోజనాలు ఉన్నాయి. ప్రధాన రహదారిపై స్మగ్లింగ్‌కు తగ్గిపోవడంత పాటు అనుమానిత వాహనాలను గుర్తించే అవకాశం ఉంది. రోడ్డు ప్రమాదాలు, దొంగతనాలకు పాల్పడిన వారిని గుర్తించడంలో ఈ సీసీ కెమెరాలు సహకరిస్తాయి. ఇప్పటి వరకు పలు కేసుల పరిష్కారంలో పోలీసులు అటవీశాఖ చెక్‌పోస్టుల వద్ద ఏర్పాటు చేసిన సీసీకెమెరాలను పరిశీలించారు.

నిత్యం పర్యవేక్షిస్తున్నాం..



జన్నారం డివిజన్‌లో నిఘా కోసం అటవీ చెక్‌పోస్టుల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేశాం. గతంలో కొంత పర్యవేక్షణ కొరవడింది. కానీ నేను విధుల్లో చేరినప్పటి నుంచి సీసీకెమెరాలను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నాం. సిబ్బంది పనితీరు కనిపెడుతున్నాం. విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఇద్దరిపై ఇప్పటికే చర్యలు తీసుకున్నాం.

– కారం శ్రీనివాస్, రేంజ్ అధికారి

గంగిపల్లిలో వన్యప్రాణుల వేట

- ఉచ్చుకు బలైన చుక్కల దుప్పులు
- మాంసం విక్రయానికి యత్నం
- పట్టుకున్న అటవీశాఖ అధికారులు


చుక్కల దుప్పి మాంసంతో నిందితులను పట్టుకున్న అటవీశాఖ అధికారులు

జైపూర్: అటవీప్రాంత సమీపంలో పంట పొలాలను కాపాడుకోవడానికి ఏర్పాటు చేసిన విద్యుత్ తీగల ఉచ్చుకు వన్యప్రాణులు బలయ్యాయి. ఉచ్చుకు రెండు చుక్కల దుప్పులు మృత్యువాతపడగా వాటి మాంసాన్ని విక్రయించేందుకు యత్నించిన సంఘటన బుధవారం వెలుగులోకి వచ్చింది. జైపూర్ మండలం గంగిపల్లి గ్రామ శివారులో గల పంట పొలాల్లో రైతులు అమర్చిన విద్యుత్ తీగలకు రెండు చుక్కల దుప్పులు మృతిచెందాయి. మాంసాన్ని విక్రయించేందుకు చిన్న ముక్కలుగా కోస్తుండగా గంగిపల్లి గ్రామానికి చెందిన పాలమాకుల శ్రీనివాస్‌రెడ్డి, గూడపాపన్నలను అటవీశాఖ అధికారులు పట్టుకున్నట్లు మంచిర్యాల రేంజ్ అధికారి రత్నాకర్ తెలిపారు. ఇద్దరిపై వన్యప్రాణుల చట్టం కింద కేసులు నమోదు చేశామన్నారు.

లాడ్జిలో దాడికి పాల్పడిన వ్యక్తులు అరెస్ట్


అరెస్ట్ వివరాలు వెల్లడిస్తున్న సీఐ ప్రమోద్‌రావు

మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని శ్రీనివాస్ గార్డెన్ సమీపంలోని ఓ లాడ్జిలో ఈనెల 1న రాత్రి జరిగిన దాడి కేసులో బుధవారం ముగ్గురిని అరెస్ట్ చేసినట్లు స్థానిక సీఐ ప్రమోద్‌రావు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం శ్రీరాంపూర్ భగత్‌సింగ్‌నగర్‌కు చెందిన ఉషకోయల తరుణ్ తన బంధువులు శ్రావణ్, పర్వతాలు, శ్రీకాంత్, రేవంత్‌లు లాడ్జిలో రూమ్ తీసుకొని శ్రావణ్ కుటుంబ సమస్యపై మాట్లాడుకుంటున్నారు. ఇదే సమయంలో రేవంత్‌కు తెలిసిన వ్యక్తి అశోక్‌రోడ్‌కు చెందిన మురుమూరు సందీప్ తన స్నేహితులు తిగుళ్ల శివకుమార్, అబ్దుల్ అఫ్రోజ్, నిఖిల్, వివేక్, అచ్యుత్, సాకేత్‌లు రేవంత్‌తో పాటు ఇతరులపై దాడిచేశారు. పాత గొడవల కారణంగా సందీప్ రేవంత్‌పై దాడి చేయగా శ్రీకాంత్, తరుణ్, పర్వతాలుకు తీవ్ర గాయాలయ్యాయి. తరుణ్ ఫిర్యాదు మేరకు సందీప్, శివకుమార్, అబ్దుల్ అఫ్రోజ్, నిఖిల్, వివేక్, అచ్యుత్, సాకేత్‌లపై కేసు నమోదు చేయగా శివకుమార్, సాకేత్, అఫ్రోజ్‌లను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు. నిఖిల్, వివేక్, అచ్యుత్, సందీప్‌లు పరారీలో ఉన్నారన్నారు.

న్యాయం చేయాలని గంగపుత్రుల నిరసన


నిరసన తెలుపుతున్న గంగపుత్ర కులస్తులు

నిర్మల్‌చైన్‌గేట్: లక్ష్మణచాంద మండలం నర్సాపూర్ డబ్ల్యూకు చెందిన గంగపుత్ర కులానికి చెందిన 10 కుటుంబాల వారు తమకు న్యాయం చేయాలని కోరుతూ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో బుధవారం కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపి కలెక్టరేట్‌లో వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ కుల సంఘానికి సంబంధించిన లెక్కలు అడిగినందుకు సంఘం అధ్యక్షుడు పడగేల మహిపాల్ తమ కుటుంబాలను కుల బహిష్కరణ చేశారన్నారు. గత పది నెలలుగా కలెక్టర్, ఎస్పీలను కలిసి సమస్య పరిష్కరించాలని కోరినా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. సమస్య పరిష్కారానికి వచ్చిన పోలీసులు కుటుంబానికి రూ.లక్ష చొప్పున ఇచ్చి కులంలో చేరాలని సలహా ఇచ్చారని పేర్కొన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దుర్గం నూతన్ కుమార్, జిల్లా అధ్యక్షుడు డాకూర్ తిరుపతి, జిల్లా ఉపాధ్యక్షుడు గైని మురళీమోహన్, హెచ్ఆర్పీ సంఘం అధ్యక్షుడు సురకంటి ఎల్లారెడ్డి, బాధిత గంగపుత్రులు పుట్టి భీమన్న, పుట్టి ఎర్రన్న ఉన్నారు.

నిరసనలో పాల్గొన్న ఎంపీ నగేశ్


నిరసన వ్యక్తం చేస్తున్న ఎంపీలు, ఎమ్మెల్యేలు

ఆదిలాబాద్: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీకి సమీప ప్రభుత్వ భూముల వేలాన్ని నిలిపివేయాలని ఆదిలాబాద్ ఎంపీ గోడం నగేశ్ అన్నారు. ఢిల్లీలోని తెలంగాణ భవన్ ఎదుట బుధవారం బీజేపీ ఎంపీలు, ప్రజాప్రతినిధులతో నిర్వహించిన నిరసన కార్యక్రమంలో ఎంపీ పాల్గొన్నారు.

ఉపాధి కూలీలపై తేనెటీగల దాడి


చికిత్స పొందుతున్న కూలీలు

కోటపల్లి: మండలంలోని కొండంపేట గ్రామ సమీపంలో ఉపాధి హామీ పథకం కూలీలపై బుధవారం తేనెటీగలు దాడి చేశాయి. కూలీలు అటవీ ప్రాంతంలో పని ప్రదేశానికి వెళ్తుండగా ఒక్కసారిగా దాడి చేయడంతో పరుగులు తీశారు. తేనెటీగల నుంచి తప్పించుకునేందుకు తలోవైపు పరుగుపెట్టారు. దాడిలో గ్రామానికి చెందిన లింగయ్య, బానయ్య, రాజు, సమ్మక్క, అంకమ్మ, బాపు స్వల్పంగా, పి.స్వరూప తీవ్రంగా గాయపడ్డారు. వీరిని స్థానికులు చెన్నూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ మూల రాజిరెడ్డి బాధితులతో మాట్లాడి విషయం తెలుసుకున్నారు. మెరుగైన వైద్య సేవలు అందించాలని వైద్యుడు సత్యనారాయణకు సూచించారు. దాడిలో కూలీల పరిస్థితి నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు.

అమ్మవారిని దర్శించుకున్న జీహెచ్ఎంసీ మేయర్


మేయర్ దంపతులను సన్మానిస్తున్న అధికారులు

సారంగపూర్: మండలంలోని అడెల్లి మహాపోచమ్మ అమ్మవారిని బుధవారం జీహెచ్ఎంసీ మేయర్ విజయలక్ష్మీ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. బోనం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. మేయర్‌కు అధికారులు ఆలయ మర్యాదలతో ఘన స్వాగతం పలికారు. మొక్కులు చెల్లించుకున్న అనంతరం ఘనంగా సత్కరించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. అనంతరం నూతనంగా నిర్మిస్తున్న మహాపోచమ్మ దేవాలయం, పరిసరాలను పరిశీలించారు. ఆమె వెంట నాయకులు గడ్డం అరవింద్‌రెడ్డి, నాయకులు ఉన్నారు.

హత్యాయత్నం కేసులో వ్యక్తికి జైలు

సోన్/నిర్మల్‌టౌన్: సోన్ మండలం కడ్తాల్ గ్రామానికి చెందిన వ్యక్తికి ఏడు సంవత్సరాల జైలుశిక్షతో పాటు రూ.3000 జరిమానా విధిస్తూ నిర్మల్ జిల్లా అసిస్టెంట్ సెషన్స్ జడ్జి శ్రీనివాస్ బుధవారం తీర్పు వెల్లడించారు. కోర్టు సమన్వయ అధికారి డల్లు సింగ్ తెలిపిన వివరాల ప్రకారం.. కడ్తాల్ గ్రామానికి చెందిన గుర్రం భీమన్న ఆటో నడుపుతూ జీవనం కొనసాగిస్తున్నాడు. 12, ఏప్రిల్, 2023న మధ్యాహ్నం గ్రామంలోని హోటల్‌లో కూర్చున్నాడు. అదే గ్రామానికి చెందిన కుడుకల పోశెట్టితో హోటల్ వద్ద గొడవ జరిగింది. దీంతో పోశెట్టి పక్కన ఉన్న పగిలిన బీర్‌సీసాతో భీమన్నను పొడిచాడు. వెంటనే అక్కడున్న వారు అడ్డుకోగా విషయం తెలుసుకున్న భార్య గంగామణి చికిత్స నిమిత్తం నిర్మల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం సోన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసి చార్జిషీట్ దాఖలు చేసి కోర్టులో హాజరుపరిచారు. అడిషనల్ పీపీ రమణారావు కోర్టులో సాక్షులను ప్రవేశపెట్టి, నేరం రుజువు చేశారు. దీంతో జడ్జి పోశెట్టికి 7 సంవత్సరాల జైలుశిక్ష, రూ.3000 జరిమానా విధిస్తూ తీర్పు ఇచ్చారు.

జొన్న పంట దగ్ధం


దగ్ధమైన జొన్న పంటను చూపుతున్న రైతు

ముధోల్: ముధోల్‌కు చెందిన కోరి యోగేశ్‌కు చెందిన జొన్న పంట పూర్తిగా దగ్ధమైంది. ఆయన తెలిపిన వివరాల ప్రకారం... యోగేశ్ 10 ఎకరాల్లో మొక్కజొన్న, జొన్న పంటలు సాగు చేశాడు. చేతికొచ్చిన జొన్న పంటను ఒకే చోటకు చేర్చి కుప్పలుగా పోశాడు. ఇటీవల వర్షం కురవడంతో రక్షణ కోసం కుప్పలపై టార్పాలిన్లు కప్పి ఉంచాడు. బుధవారం ఉదయం చేనుకు వచ్చే సరికి పంట కుప్పలు కాలిపోయి ఉన్నాయి. పంట కుప్పలు దగ్ధం కావడానికి గల కారణం ఎంటో తెలియడం లేదని బాధిత రైతు వాపోతున్నాడు. అప్పులు తెచ్చి పంట సాగు చేశానని అప్పులు ఎలా తీర్చాలో తెలియడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు.

భార్య, అత్తపై దాడి.. వ్యక్తి అరెస్ట్


అరెస్ట్ చూపుతున్న ఎస్సై కిరణ్‌కుమార్

తాండూర్: భార్య, అత్తను చితకబాది గాయపర్చిన కేసులో ఓ వ్యక్తిని పోలీసులు బుధవారం అరెస్ట్ చేశారు. ఎస్సై కిరణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. తాండూర్ మండలం అచ్చులాపూర్ గ్రామపంచాయతీ కొమ్ముగూడెం గ్రామానికి చెందిన దాగం మల్లేశ్ గతనెల 16న మద్యం తాగి భార్య లావణ్యతో గొడవపడ్డాడు. లావణ్యపై దాడి చేయడానికి సిద్ధపడగా అత్త రాజు అడ్డుపడింది. కోపోద్రిక్తుడైన మల్లేశ్ గరిటెతో ఇరువురు తలలపై బలంగా కొట్టి గాయపర్చాడు. బాధితుల ఫిర్యాదు మేరకు విచారణ జరిపి అరెస్టు చేసి కోర్టులో హాజరు పర్చినట్లు ఎస్సై తెలిపారు.

గంజాయి తరలిస్తున్న ఇద్దరు అరెస్ట్

నేరడిగొండ: అక్రమంగా గంజాయి తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. నిర్మల్ వైపు గంజాయి తరలిస్తున్నారనే పక్కా సమాచారం మేరకు సిబ్బందితో కలిసి బుధవారం బందం ఎక్స్‌రోడ్ వద్ద తనిఖీలు చేపట్టగా నేరడిగొండ మండలం వాంకిడి గ్రామానికి చెందిన షేక్ మజార్, నిర్మల్ జిల్లాకు చెందిన షేక్ ఇమ్రాన్ అనే ఇద్దరు వ్యక్తుల వద్ద 150 గ్రాముల గంజాయి లభించినట్లు తెలిపారు. వారిని విచారించగా నేరడిగొండ మండలంలోని ధన్నూర్(డి) గ్రామానికి చెందిన కాటరే తారాసింగ్ వద్ద నుంచి గంజాయి తీసుకొస్తున్నట్లు తేలిందన్నారు.

వ్యక్తి రిమాండ్

బజార్‌హత్నూర్: గంజాయితో ఉన్న వ్యక్తిని రిమాండ్‌కు తరలించిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. మండలంలోని మోర్ఖండి గ్రామ సమీపంలో మంగళవారం రాత్రి పోలీస్‌పెట్రోలింగ్ నిర్వహిస్తున్న సమయంలో గులాబ్‌తండా గ్రామపంచాయతీ పరిధి ఇంద్రనగర్ గ్రామానికి చెందిన ఆడే రాజ్‌కుమార్ అనుమానాదస్పదంగా కన్పించాడు. అతడిని తనిఖీ చేయగా అతని వద్ద 100 గ్రాముల గంజాయి లభించింది. వెంటనే రాజ్‌కుమార్‌ను అరెస్ట్ చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్సై అప్పారావు తెలిపారు. బుధవారం బోథ్ కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై పేర్కొన్నారు.

తెల్లకల్లు షాపుపై పోలీసుల దాడి

బేల: మండలంలోని జంగుగూడ (సైద్‌పూర్)లో లైసెన్స్ లేకుండా నిర్వహిస్తున్న తెల్లకల్లు షాపుపై మంగళవారం రాత్రి జైనథ్ సర్కిల్ సీఐ సాయినాథ్, బేల ఎస్సై దివ్యభారతిలు సిబ్బందితో కలిసి దాడి చేశారు. తెల్లకల్లు షాపులోని 400 లీటర్ల తెల్లకల్లును ధ్వంసం చేసి, రూ.3వేల నగదును సీజ్ చేసినట్లు వారు పేర్కొన్నారు. షాపు యజమాని బేలకు చెందిన సత్యనారయణ్ గౌడ్, షాపు నిర్వాహకుడు తుకారాంతో పాటు అక్రమషాపు నిర్వహణకు రూ.12లక్షలకు అనుమతి ఇచ్చిన వీడీసీ చైర్మన్ ఆత్రం రాముడుపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ఆత్మహత్యాయత్నం.. కాపాడిన పోలీస్


కౌన్సెలింగ్ ఇస్తున్న కానిస్టేబుల్ మోహన్‌సింగ్

బాసర: గోదావరి నదిలో పిల్లలతో కలిసి దూకేందుకు యత్నించిన వ్యక్తికి పోలీసులు కౌన్సెలింగ్ ఇచ్చి కుటుంబ సభ్యులకు అప్పగించిన ఘటన మండలకేంద్రంలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. నిజామాబాద్ జిల్లా బోయగల్లికి చెందిన కోమటి గంగప్రసాద్, భార్య లక్ష్మి నిజామాబాద్‌లోని బట్టల దుకాణంలో పని చేస్తుంటారు. వారికి ఇద్దరు ఆడ పిల్లలు వర్షిణి, రక్షిత ఉన్నారు. కాగా కుటుంబ సమస్యల కారణంగా తన ఇద్దరు పిల్లలను తీసుకుని గంగప్రసాద్ బుధవారం బాసర మండల కేంద్రంలోని గోదావరి నదిలో దూకి ఆత్మహత్య చేసుకునేందుకు ప్రయత్నించాడు. అక్కడే విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుల్ మోహన్‌సింగ్ గమనించి హుటాహుటిన వారి వద్దకు చేరుకున్నాడు. ఆత్మహత్యకు యత్నిస్తున్న గంగప్రసాద్‌ను అతని ఇద్దరి పిల్లలను దగ్గరికి తీసుకొని ఓదార్చాడు. గంగప్రసాద్‌కు కౌన్సెలింగ్ ఇచ్చి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అనంతరం కుటుంబ సభ్యులకు సమాచారం అందించి వారిని అప్పగించారు. కాగా చాకచక్యంగా వ్యవహరించి ఆత్మహత్య చేసుకోకుండా కాపాడిన కానిస్టేబుల్ మోహన్‌సింగ్‌ను ఎస్సై గణేశ్, ఇతర సిబ్బంది అభినందించారు.

రోడ్డు ప్రమాదంలో మంచిర్యాల వాసి మృతి


విజయ్ (ఫైల్)

మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని రాంనగర్‌కు చెందిన పీవోడబ్ల్యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అందే మంగ భర్త విజయ్ (53) బుధవారం హైదరాబాద్ రింగురోడ్డుపై జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం విజయ్ తన అన్న కూతురు సోనిని అమెరికా పంపించేందుకు ఈనెల1న అన్నయ్య రాములు, వదిన విజయ, మరో స్నేహితుడితో కలిసి తన కారులో వెళ్లాడు. బుధవారం తెల్లవారుజామున తిరిగి వస్తుండగా రింగ్‌రోడ్డుపై కంటైనర్ లారీ ఢీకొనడంతో విజయ్ అక్కడికక్కడే మృతి చెందాడు. అన్నయ్య రాములుకు, డ్రైవర్‌కు స్వల్ప గాయాలు కాగా రాములు భార్య విజయ తీవ్రంగా గాయపడింది. ప్రస్తుతం ఆమె హైదరాబాద్‌లోనే చికిత్స పొందుతోంది. విజయ్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు.

రాజ్యాంగ పరిరక్షణకే పాదయాత్ర


పాదయాత్రలో పాల్గొన్న ఆత్రం సుగుణ

నార్నూర్: రాజ్యాంగ పరిరక్షణకే జైబాపు, జైభీమ్, జై సంవిధాన్ పాదయాత్ర నిర్వహిస్తున్నట్లు కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ ఇన్‌చార్జి ఆత్రం సుగుణ అన్నారు. బుధవారం మండలంలోని పూసిగూడ గ్రామం నుంచి జిల్లా కోఆర్డినేటర్ ఏఐసీసీ సభ్యుడు నరేశ్ జాదవ్‌తో కలిసి పాదయాత్ర ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ దేశంలో నియంతృత్వ, అప్రజాస్వామిక పాలన కొనసాగిస్తున్న బీజేపీ ప్రభుత్వ విధానాలను ప్రజలకు తెలుపాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం ప్రజలతో, కార్యకర్తలతో రాజ్యాంగ ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు లోఖండే దేవురావు, మాజీ సర్పంచ్ బానోత్ గజానందు నాయక్, మాజీ ఎంపీటీసీ పరమేశ్వర్, మహిళ నాయకురాలు బానోత్ ప్రణీత, పీఏసీఎస్ డైరెక్టర్ కాంతారావు దుర్గే, యంగ్ అండ్ డైనమిక్ లీడర్ కోర్వెళ్ల మహేందర్, కాంగ్రెస్ పార్టీ యూత్ జిల్లా ఉపాధ్యక్షుడు నసీర్ తదితరులు ఉన్నారు.

అక్రమ వసూళ్లకు పాల్పడితే కేసులు


జీవన్ రెడ్డి, ఆదిలాబాద్ డీఎస్పీ

ఆదిలాబాద్‌టౌన్: గ్రామాభివృద్ధి కమిటీల పేరుతో ఎలాంటి వసూళ్లకు పాల్పడొద్దని ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్.జీవన్ రెడ్డి హెచ్చరించారు. బుధవారం డీఎస్పీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. వీడీసీలకు ఎలాంటి అధికారిక గుర్తింపు లేదన్నారు. ఈ కమిటీలు వసూళ్లకు పాల్పడితే చట్టప్రకారం కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. బేల మండలం సాంగిడి, జైనథ్ మండలం సాంగ్వి గ్రామాల్లో ఇసుక ట్రాక్టర్ల వద్ద డబ్బులు వసూలు చేసిన వీడీసీలపై కేసులు నమోదు చేశామన్నారు. ఎక్సైజ్‌శాఖ అనుమతులతోనే మద్యం షాపులు నిర్వహించుకోవాలని, వీడీసీలు అనుమతులు ఇవ్వడం చట్ట వ్యతిరేకమని పేర్కొన్నారు.

బంగారు గొలుసు అపహరణ

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ పట్టణంలోని గాంధీనగర్‌లో ఐదేళ్ల బాబు మెడలో నుంచి బంగారు గొలుసు అపహరణకు గురైనట్లు టూటౌన్ ఎస్సై విష్ణుప్రకాశ్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. గాంధీనగర్‌కు చెందిన గౌరాల రాజేశ్వరి మనమడు ఆడుకుంటున్న సమయంలో అదే కాలనీకి చెందిన ఆకాశ్ అనే వ్యక్తి బాబుకు కూల్‌డ్రింక్ కొనిచ్చి మెడలోని గ్రాము బంగారు గొలుసును లాక్కొని పరారయ్యాడు. రాజేశ్వరి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి నిందితుడిని బుధవారం రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

బెల్ట్‌షాపులపై దాడులు

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ పట్టణంలోని సుందరయ్యనగర్ కాలనీలో గల బెల్ట్‌షాపుల్లో బుధవారం తనిఖీలు చేసినట్లు సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్ తెలిపారు. అనుమతులు లేకుండా బెల్ట్‌షాపులు నిర్వహిస్తున్న నలుగురు వ్యక్తులు సుందరయ్యనగర్‌కు చెందిన జల్లార్‌పూర్‌వార్ సుధాకర్, గులేందవ ఇంద్ర, బోయపల్లి అభి యాదవ్, శ్రీరామ్ కాలనీకి చెందిన తలకోకుల భూమన్నలపై కేసులు నమోదు చేశామన్నారు. వారి వద్ద నుంచి స్వాధీనం చేసుకున్న మద్యం విలువ దాదాపు రూ.15370 ఉంటుందని తెలిపారు.

ఇంట్లో చోరీ

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ పట్టణంలోని జైజవాన్‌నగర్‌కు చెందిన లక్ష్మి ఇంట్లో మంగళవారం రాత్రి చోరీ జరిగింది. టూటౌన్ ఎస్సై విష్ణుప్రకాష్ తెలిపిన వివరాల ప్రకారం.. లక్ష్మి మహారాష్ట్రలోని బోరికి వెళ్లగా, ఇంట్లో ఆమె పిల్లలు ఉన్నారు. రాత్రి సమయంలో ఇంటికి తాళం వేసి పక్కింట్లో నిద్రపోయారు. ఉదయం వచ్చి చూసేసరికి ఇంటి తాళం పగిలి ఉంది. ఇంట్లో ఉన్న 3 గ్రాముల బంగారంతోపాటు సిల్వర్ చైన్ అపహరణకు గురైంది. వాటి విలువ రూ.16వేలు ఉంటుందని తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.